# అంతలో వుంది

రాజశ్రీ జిల్లా విద్యాశాఖాధికారి గారి దివ్యసముఖమునకు

ఈ క్రింది చేవ్రాళ్ళు, చేగుర్తులు చేయగల రాజులపేట వాస్తవ్యులు అనేక దండములు పెట్టి వ్రాసుకున్న మహజరు.

అయ్యా!

అయిదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్న ఈవూరి పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడుగావున్న వీరాల రామన్నగారి హయాంలో బడి సత్రంగానూ, పిల్లలు కోతులుగానూ తయారైనారని తెల్పుటకు విచారిస్తున్నాము. బడికి వేళకు రాకపోవుట, వచ్చినా పాఠములు చెప్పకపోవుట, చీటికి మాటికీ సహోపాధ్యాయుల పైన వీర విహారముచేయుట మట్టుమర్యాద అన్నమాటలేక గ్రామస్తులను నోటికి వచ్చినట్లల్లా తూలనాడుట మున్నగు అతని దుష్కార్యములు లెక్కకు మిక్కుటంగా వున్నవని తెలియజేయుటకు మేము మరి మరీ చింతిస్తున్నాము. సదరు రామన్నగారికి కోపముమెండు. ఓపిక తక్కువ ఈ పైకారణములవల్ల అతనికి గవర్మెంటు ఎప్పుడో ఋణపడి వుందునినీ, ఆఋణము యిప్పుడు నెలవారీ కంతులలో జీతమన్న పేరుతో చెల్లింపబడుతూ వుందనీ భావిస్తున్నాముగాన కామందులవారు ఈ గ్రామవాసులపట్ల దయవుంచి ఈ వీరాల రామన్నగారిని ఉద్యోగమునంచీ తొలగించిగానీ, లేదా వేరొక వూరికి మార్పించిగానీ మాపిల్లలనూ మమ్ములనూ కాపాడగలరని తమ ఘనతను మరి మరీ ప్రార్థించుచున్నాము.

ఇట్లు తమ విధేయులు

1. పోతుగడ్డ భీమలింగం
2. వల్లకల్ల రంగయ్య
3. టేకిమానునరసప్ప

(ఇంకా పాతిక మందివి చేవ్రాళ్ళు నలభై ఆరు మందివి ఎడమచేతి బొటన వ్రేలి గుర్తులు)

షరా: గౌరవనీయులు రాష్ట్ర విద్యామంత్రి గారికి కాపీ పంపుకొనడమైనది.

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

రేంజి డిప్యూటి యిన్‌స్పెక్టరుకు

విషయము: రాజులపేట ప్రధానోపాధ్యాయుడు వీరాల రామన్నగారి విశృంఖల వీర విహారం. గ్రామస్తులహాహాకారం. తక్షణ చర్య అత్యవసరం.

నీరేంజిలో యిటువంటి గందరగోళం జరుగుతున్న విషయాన్ని నువ్వింత వరకు పసిగట్టక పోవడమూ, ఒకవేళ పసిగట్టివుంటే సదరు విషయాన్ని మాదృష్టికి తేక పోవడమూ మిక్కిలి శోచనీయము. తక్షణము రాజుల పేటలో మకాముచేసి గ్రామస్తులను ఉపాధ్యాయులను సమావేశపరచి నిష్పక్షపాతముగా నిజానిజములను బేరీజువేసి, ఈ తాఖీదు అందిన మూడు దినములలోపల నీ అభిప్రాయమును ఈ ఆఫీసుకు తెలుపగోరడమైనది.

జిల్లా విద్యాశాఖాధికారి

రాజశ్రీ డిప్యూటీ యిన్‌స్పెక్టరుగారికి.

రాజులపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరాల రామన్న వ్రాసుకున్న సంజాయిషీ ఏమనగా.

అయ్యా!

ఇటీవల నాపైన చెలరేగిన ఆరోపణల దృష్ట్యా ఈ క్రింది విషయములను విన్న వించుకోదలచినాను. వీటి మూలంగా ఈ ఆరోపణలెంత నిరాధారమైనవో తమ కవగతం కాగలవని నమ్ముచున్నాను.

1. 1930వ సంవత్సరం నుండి గడిచిన ముప్ఫై యేళ్లుగా నేను జిల్లాకోర్టు యాజమాన్యము క్రింద తీగలపెంట, చీరతలకుంట, రామజోగిపేట, తారాపల్లె మున్నగు గ్రామములలో కొంతకాలము సహోపాధ్యాయుడనుగానూ, మరి కొంతకాలము ప్రధానోపాధ్యాయుడనుగానూ పనిచేసియున్నాను. సుదీర్ఘమైన ఈ సర్వీసులో ఏ పరీక్షాధి కారిగాని, నా నడతపట్ల ఉద్యోగ నిర్వహణపట్ల అసంతృప్తిని వెల్లడించి యుండలేదు.

2. అయిదేళ్ళకు మునపు నేనీ గ్రామమునకు బదిలీ అయినప్పుడు ఈ పాఠశాలలో ప్ర.ఉ.తోసహా ముగ్గురు టీచర్లు మాత్రమే పనిచేస్తుండేవారు విద్యార్థుల సంఖ్యచాలక

పోవడంవల్ల మూడోటీచరును తీసివేయాలన్న వుద్దేశాన్ని అప్పట్లో అధికార్లు పలుసార్లు వెల్లడించియున్నారు. అట్టి పాఠశాల ప్రస్తుతం అయిదుగురు టీచర్లతో నూటయాభైమంది విద్యార్థులతో పనిచేస్తుండడం తమకు తెలియనదిగాదు. ఈ సందర్భంలో "అనతి కాలంలో యింతటి అభివృద్ధిని సాధించినందులకు ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తప్పనిసరిగా ప్రశంసనీయుడు" అంటూ తమరు గడచిన సాంవత్సరిక నివేదికలో పేర్కొన్న అంశాన్ని యిక్కడ వుదహరించడం అప్రస్తుతం కాదను కుంటాను.

నేను ముక్కోపిననీ, సహోపాధ్యాయులపైన మండిపడుచున్నాననీ, గ్రామస్తులను తూలనాడు చున్నాననీ వచ్చిన ఆరోపణలను నేను జాగ్రత్తగా గమనించినాను. ఇవి వట్టి నీలాప నిందలన్న విషయం మీకు గ్రామంలో ఏ ప్రత్యేక వ్యక్తిని విచారించినా తెలియగలదు. నాపైన వ్యతిరేకముగా పైవారికి సమర్పించుకోబడిన మహాజరులో వ్రేలిముంద్రల వారికేగాదు, సంతకాల వారిలో చాలమందికిగూడా అందులో వ్రాయబడిన విషయమేమిటో తెలిసివుండదని నేను నమ్మకంగా చెప్పగలను. సామన్య ప్రజలచేత వ్రేలిముద్రలు వేయించడం మనదేశంలో నీళ్లు త్రాగడంకంటె సులభసాధ్యమైవుండడం మీకు విదితమే ననుకుంటాను. పోగా నన్ను ముక్కోపిగా చిత్రించబూనడం నామట్టుకు నాకే ఆశ్చర్యకరంగా వున్నమాట వాస్తవం. ఎందులకనగా గడిచిన నా ఉద్యోగ జీవితంలో రకరకాల వ్యక్తులమధ్య కొత్తకొత్త పరిసరాల్లో మెలగుతూ అనేక కష్టనష్టాలకు గురి కాబడుతూ వచ్చిన నేను, కోపమంటే ఏమిటో దాదాపు మరచి పోయినాననే చెప్పవచ్చును. స్పర్శజ్ఞానికి అతీతంగా పరిణమించిన చర్మంలా, దూషణ భూషణలకు అతీతంగా నా మనసు మొద్దుబారిపోయిందనీ ఎవ్వరేమన్నా నన్ను కాదన్నట్టుగా తలవంచుకొని పోగలిగిన పాటి మనో నిగ్రహాన్నీ మానసిక జడత్వాన్ని నా ఉపాధ్యాయవృత్తి నాకు ప్రసాదించ గలిగిందనీ మీకు సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

4. గ్రామ పెద్దలకు నాపట్ల కినుక జనించటానికి కారణం నాప్రవర్తనలోని లోపం కాదనీ, కారణం ఏదైనప్పటికీ పరిస్థితి యింతవరకు వచ్చిన తర్వాత నేనిదే వూళ్ళో ఉద్యోగం చేయడం ఏమంత భావ్యంగా వుండదనీ భావిస్తున్నాను గాన ఈ ఉపాధ్యాయుని పట్ల దయవుంచి వీలైనంత సత్వరముగా నన్ను మరొక వూరికి బదిలీ చేయించుటకై సిఫార్సు చేయగలరని ప్రార్థించుతూ, సంజాయిషీ ముగించుకొను చున్నాను.

విధేయుడు,

వీరాల రామన్న.

డిప్యూటీ యిన్‌స్పెక్టరు కార్యాలయం

జిల్లా విద్యాశాఖాధికారి గారికి-

విషయము: రాజులపేట ప్రదానోపాధ్యాయుడు వీరాల రామన్నగారిపైన లేచిన దుమారము. ఎన్‌క్వయరీ నిర్వహణ- అభిప్రాయ సమర్పణ.

అయ్యా!

తమ ఆదేశానుసారము రాజులపేటలో మకాముచేసి గ్రామస్తులను, ఉపాధ్యాయులనూ విడివిడిగానూ, సమిష్టిగానూ విచారించినమీదట నేనీక్రింది నిర్ణయములకు రాగలిగినాను.

1: ఈ పాఠశాల ప్ర.ఉ.వీరాల రామన్నగారు బడికి వేళకు రాకపోవుట, పాఠములు సరిగా చెప్పకుండుట, సహోపాధ్యాయులపైన విరుచుకపడుట, మున్నగు ఆరోపణల సారాంశము సర్వాబద్ధము. ఈ విషయము విద్యార్థులను ఒక్కొక్కరినిగా పిలిపించి ప్రశ్నలవర్షం కురిపించగా తెలియవచ్చినది. గ్రామ పెద్దలలో వ్యాపించి యున్నంత రాజకీయ చైతన్యం యింకా కుర్ర కుంకలలో వ్యాపించకపోవడంవల్ల వీళ్ళీ విధంగా నిజాన్ని ప్రకటించి వుంటారని భావిస్తున్నాను.

2. విద్యార్థులనేగాక గ్రామములోని పెద్దమనుషులతోగూడా నేను విడివిడిగా మాట్లాడినాను. వీరు మింగనూలేక కక్కనూలేక గొంతుకలో వెలగకాయపడినట్టు బిక్క మొగముపెట్టినారు: నిజము చెప్పినచో గ్రామపెద్దల ఆగ్రహమునకు గురికావలసి వచ్చునన్న భయాందోళనలే యిందులకు కారణముగా వచ్చును.

3. పోగా ఈ గందరగోళానికి కారణం ప్ర.ఉ.ని అయోగ్యతకానీ, అసమర్థతగానీ కారణం కాదనీ నేను అభిప్రాయ పడుచున్నాను ఈ పాఠశాల అయిదారు మాసాల క్రితంవరకు పోతుగడం భీమలింగంగారి కట్టడంలో వుంటూ వుండేది. అది మంటిమిద్దె. ఉత్తర ధ్రువంలోని ఎస్కిమోలకు ఆరునెలలు పగలు, ఆరునెలలు రాత్రి అని చెబుతుంది భూగోళం. కిటికీలు మూసినట్టయితే ఈ మంటిమిద్దెలో సంవత్సరం పొడుగునా చీకటే ప్రత్యక్షమవుతుంది. పైగా యిదిచాలా పాతకాలపు కట్టడం కావడంవల్ల గోడలను ఉప్పుతిని వేస్తుండేది. పైకప్పునుంచి హమేషా దుమ్మో, మట్టిబెడ్డలో రాలుతుండేవి. ఇక వానకురిస్తే సగం నీళ్ళు కప్పులోనుంచి క్రిందికి దూకి గోడలమధ్య చిన్న రిజర్వాయరు రూపొందేది. జీవిత భీమాచేయించుకోవలసిన అవసరం కట్టడంలోపలికి వెళ్ళదలచుకున్నప్పుడు తెలిసినంత బాగా మరొకప్పుడు తెలిసేదిగాదు.

కానీ ఎన్ని అసౌకర్యాలున్నప్పటికీ ఆ కట్టడం మూలంగా పో.భీ.గారికి నెలనెలా పాతిక రూపాయల అద్దె పింఛనులాగా ముట్టుతుండేది.

ఇటీవల పాఠశాల వేరొక కట్టడంలోకి మార్చుబడింది లగాయతు ఈ మార్పుకు కారణం ప్రధానోపాధ్యాయుడే నన్న వుద్దేశంతో సదరు పో.భీ గారు అంబోతులా రంకెలువేస్తూ, పోతురాజులాపళ్లు కొరుకుతూ కారుబారు చేయదంజరిగింది. చేయవలసిన ప్రతీకారాలన్నీ చేసిన మీదట, యికచేసేదిలేక ప్ర.ఉ. పైన పైవారికి మహజరు పెట్టుకునేటంతవరకు శ్రీవారి ఆగ్రహం అనేకానే కరూపాలు ధరిస్తూ వచ్చింది.

4.నా బుద్ధికి తోచినంతలో ఈ చిక్కు పరిష్కారం కావడానికి రెండంటే రెండు పద్ధతులు మాత్రమే గోచరిస్తున్నాయి. పాఠశాలను మళ్ళీ పాత కట్టడంలోకి మార్చడం మొదటి పద్ధతి, లేదా ప్ర.ఉ. ని దూర ప్రాంతాలకు బదిలీ చేయడం రెండో పద్ధతి. ఈ రెండింటిలోనూ ఉత్తమోత్తమముగా తోచిన పద్ధతి ద్వారా ఈ సమస్య వీలైనంత తొందరగా పరిష్కరింప బడగలదని ఆశిస్తున్నాను.

విధేయుడు,

డిప్యూటి యిన్ స్పెక్టరు.

జిల్లాబోర్డు కార్యాలయంఉత్తరువు

పాఠశాలను మళ్ళీ పాతకట్టడంలోకి మార్చి చరిత్రలో మరొక 'కలకత్తా చీకటి గది' ఉదంతానికి దారితీయడం వాంఛనీయంకాదు కాన ప్ర. ఉ. రామన్నను (సార్థక నామధేయం కలిగిన) అడవిలో పల్లెకు బదిలీ చేయడమైనది. ఈ మార్పు అతనికోరిక ప్రకారమే జరుగుతున్నందువల్ల, యిందుకు టి. ఏ. యివ్వబడదని కచ్చితముగా తెలపడమైనది.

❀ ❀ ❀